

# ఆపదేనా?

**తెల్లవారేటప్పటికి మా** వీధంతా గుప్పుమంది-శేషగిరి కూతురు పార్వతి లేచిపోయిందని. నేనుపొద్దున్నే కాఫీ తాగుతూ వుండగా నా భార్య ఈ వార్త తెచ్చి నా చెవిలో వేసింది. ఇలాంటి పుకార్లను నమ్మడానికి యిష్టం లేక, కాస్త విసుగ్గా "యెవరన్నారు" అన్నాను "ఒక రనడ మేమిటండీ, వీధిలో అందరూ అనుకుంటుంటేనూ!" అన్నది నా భార్య. యే మనడానికీ తోచక కాఫీ తాగుతూ వుండిపోయినాను. ఒక నిమిషం తర్వాత నా భార్యే మళ్ళీ అన్నది. "వాళ్ళింటికి వెళ్ళి కాస్త విచారించిరాకూడదూ! యెంతయినా ఆయనా, మీరూ స్నేహితులే కదా!" నిజమే, శేషగిరీ, నేనూ స్నేహితులమే. కానీ, నా భార్య ఉద్దేశమేమిటా అని నాకు సందేహం కలిగింది. లేచిపోవడాలన్నా రంకుతనాలన్నా ఆడవాళ్ళకు మహా ఆసక్తి. అపనిందలను పదేపదే వినడం పట్లా, ప్రచారంచేయడంపట్లా వున్నంత అభిలాష వీళ్ళకు దేనిపట్లా వుండదని నాకు గట్టి నమ్మకం. అందుకని నా భార్య ముఖంలోకి పరీక్షగా చూసినాను. యేమీతొణక్కుండా ఆమె "అలాచూస్తా రేమిటి! ఆపదలో వున్నవాళ్ళను కాస్త వెళ్ళి పలకరిస్తే తప్పా! పాప, ఓదార్చే వాళ్ళుకూడా లేక వాళ్ళెంతగా కుమిలి పోతున్నారో!" అన్నది. ఈ మాటలతో నాకు కొంత పశ్చాత్తాపం కలిగింది. మిత్రుడు ఆపదలో వుండగా

# రాచమల్లు రామచంద్రారెడ్డి

నాకు సానుభూతి కలక్కపోగా, నా భార్య చిత్తశుద్ధిని శంకించే స్థితికి వెళ్ళినాను. శేషగిరి ఇంటికి పోవడానికి సిద్ధమౌతూ, హఠాత్తుగా యేదో మనసులో మెదలి, "ఇంతకూ, యిది ఆపదేనంటావా?" అన్నాను. నా భార్యకు చురుక్కు మన్నట్లుంది. "కూతురు లేచి పోతే ఆపద కాక, వేడుక అవుతుందా! మీకూ ఆడపిల్లలున్నారు. గుర్తుంచుకోండి" అంటూ విసవిసా లోపలికి వెళ్ళింది.

"ఇది ఆపదేనంటావా?" అని నేను వూరకే అడగలేదు శేషగిరి యెన్నాళ్ళున్నా కూతురుకు తగిన సంబంధం తెచ్చే స్థితిలో లేడు పార్వతికి ఇంత వరకు పెండ్లి కాకపోవడమే దానికి నిదర్శనం. ఈ పవిత్ర భారతదేశపు తల్లిదండ్రులు తమ ఆడపిల్లలకు తాము పెండ్లి చేయనూలేరు; ఆ పిల్లలు తెగించి తమ పెండ్లి తామే చేసుకుంటామంటే సహించనూ లేరు. పార్వతి లేచిపోయిందంటే, ఆ పిల్ల సుఖపడినా, సుఖపడక పోయినా, శేషగిరికి మాత్రం పెద్దభారం తొలగిపోయినట్లే అని నాకు అనిపించింది. "ఇది ఆపదే నంటావా?" అని నేను అనడం అందువల్లనే. అయినా నా మనసులోని మాట మనసులో వుంచుకోకుండా ఆడవాళ్ళముందు బయటపెట్టడం తప్పే అని ఒప్పుకోవాలి ఈ ఆడవాళ్ళకు తోడి ఆడవాళ్ళపట్ల అభిమానం పుట్టినా, అసూయపుట్టినా పట్ట శక్యం



కాదు. అదొక చిత్రమయిన వర్గ చైతన్యమో, వర్గ సంఘీభావమో అనుకోవాలి. లేచిపోయినవాళ్ళపట్లా, అపనిందలకు గురయిన వాళ్ళపట్లా యెంతకసిగా యెంత క్రూరంగా ప్రవర్తించగలరో మగని మరణం వల్లనో, మగవాళ్ళ దౌష్ట్యం వల్లనో ఆపదలో వున్నవాళ్ళ పట్ల అంత దయా, అంత సానుభూతీ చూపించగలరు ఈ ఆడవాళ్ళు. అందుకనే పెండ్లీ, పేరంటం లాంటి శుభ కార్యాల్లో అంత ఐకమత్యంగా, అంత అన్యోన్యంగా మెలగగలరు; నెలతప్పినా నెలలు నిండి నొప్పులు వచ్చినా, అంత నిష్కపటమయిన సహానుభూతి చెందగలరు.

నేనూ, శేషగిరీ ఒకే ఆఫీసులో పనిచేయడమేకాక, ఒకే వీధిలో కాస్త దగ్గర దగ్గరగానే కాపురం వుంటున్నాం. సాధారణంగా ఇద్దరమూ కలిసే ఆఫీసుకు పోతాం, ఆఫీసునుండి కలిసే ఇంటికి వస్తాం. అందువల్ల యిద్దరమూ స్నేహితులమని చెప్పుకోదగిన స్థితి ఏర్పడింది. అయినా అది పట్నవాసపు స్నేహితంగానే మిగిలిపోయింది. మనసులు విప్పి మర్మాలు బయట పెట్టుకునే స్థితికి ఆ స్నేహితం ఎప్పుడూ ఎదగనే లేదు. ఏమైనా, ఏదో ఒక స్థాయిలో మేమిద్దరం స్నేహితులమే. కనుక శేషగిరిని పరామర్శించడం మిత్రధర్మమని నాకూ అనిపించింది.

నేను వెళ్లేటప్పటికి శేషగిరి వరండాలో కూర్చొని ఉన్నాడు. లోపల గదిలో శేషగిరి భార్య నాగరత్నమ్మా, పిల్లలూ, నలుగురైదుగురు ఇరుగుపొరుగు ఆడవాళ్ళూ ఉన్నట్లుంది. నన్ను చూసి, "రా" అంటూ శేషగిరి తనపక్కనున్న కుర్చీ చూపించినాడు. నేను మౌనంగా కూర్చున్నాను. అతని ముఖంలోని దిగులూ, దుఃఖమూ చూసి నాకు నోటమాట రాలేదు. అతన్ని ఎలా పరామర్శించాలో ఏమని ఓదార్చాలో నాకేమీ తోచలేదు లోపలినుండి నాగరత్నమ్మ ఏడుపూ, ఆ ఏడుపులోనే కూతురుమీద తిట్లూ, శాపనార్థాలూ కురిపించడమూ – అన్నీ వినిపిస్తున్నాయి. "దాని నెత్తిన నిప్పులు పొయ్యా, దాని ముండమొయ్యా, దాని కడుపున కల్లగొట్ట" అంటూ ఆమెపార్వతికి శాపాలు పెడుతున్నది. "ఊరుకో అక్కా, ఎంతైనా నీ కడుపున పుట్టినబిడ్డ. అంతంత మాటలు అనవద్దు" అంటూ ఎవరో ఆమెను ఊరడించడానికి ప్రయత్నిస్తున్నారు. "అది నా బిడ్డ కాదు, నా కడుపున పుట్టిన పుండు పాడు ముండ! పీడముండ! పోతూపోతూ నా గొంతులో ఇంత విషం పోసి పోకూడదూ!" అంటూ నాగరత్నమ్మ వెక్కిళ్ళమధ్యనే తిట్టుతున్నది.

రెండు మూడు నిమిషాలు నేను మౌనంగానే కూర్చున్నాను. శేషగిరి కూడా మౌనంగానే వున్నాడు. ఏమీ మాట్లాడకపోవడం బాగుండదని నేనే మొదలు పెట్టినాను. "ఏం శేషగిరీ, ఏం చేద్దామనుకుంటున్నావ్?" అన్నాను మెల్లగా. "చేసేదేముంది! ముఖం చాటు చేసుకోపడమూ, ముసుగుపెట్టి పండుకోవడమూ తప్ప!" అన్నాడు శేషగిరి. ఒకక్షణం ఆగి అతనే మళ్ళీ అన్నాడు. "మళ్ళీ తల ఎత్తుకొని తిరగడం ఎలాగో

అమాయకరావ్ తన ప్రియురాలితో రైళ్ళో ప్రయాణంచేస్తోంటే హఠాత్తుగా రైలు ఓ సొరగంలోకి ప్రవేశించి అంతా చీకటి మయం అయిపోయింది. మళ్ళీ వెలుగులోకి వచ్చాక అతను ఆమె దగ్గరగా జరిగి "ఇందాక ఆ చీకట్లో నిన్ను ముద్దు పెట్టుకుని ఉన్నట్లయితే ఏమనేదానివి?" అనడిగాడు ఉత్సాహంగా. "అంటే–ముద్దు పెట్టుకుంది నువ్వు కాదా?" ఆశ్చర్యంగా అడిగిందామె.



తెలియకుండా వుంది." ఈ మాట అన్నప్పుడు దుఃఖంతో అతని కంఠం వణికింది. అతని దుఃఖం చూసి నాకూ నిజంగా బాధ కలిగింది. ఏదైనా సలహా ఇస్తే బాగుంటుందేమోఅనేఉద్దేశంతోనేను "పోలీసులకు రిపోర్టు ఇవ్వదలచుకున్నావా?" అన్నాను. అప్పుడతను ముఖం ఎత్తి నావైపు చూస్తూ 'ఎందుకూ? లేచిపోయిన ముండ అనే అపకీర్తి ఎలాగూ తప్పదు కదా! పోయిన ముండ పోసి. పోలీసులు పట్టుకొని తీసుకు వచ్చినా ఆ ముండకి కొంపలో ఇకస్థానం లేదు" అన్నాడు. మాట కటువుగా వున్నా, అతని గొంతులో కోపంకంటె దుఃఖమే ఎక్కువగా ధ్వనించింది. వెంటనే అతను జేబులోనుండి ఒక కాగితం తీసి నా చేతికిచ్చాడు. పార్వతి రాసిపెట్టిపోయిన జాబు అది. దానిలో మూడే వాక్యాలున్నాయి. "పోలీసులకు ఫిర్యాదు చేసినా, నన్ను పట్టుకోడానికి ప్రయత్నించినా, మీకు నా శవం మాత్రమే దొరుకుతుంది. కొన్నాళ్ళ తర్వాత నేను క్షేమంగా తిరిగి వస్తాను. అంతవరకు క్షమించండి" అంతే ఆ జాబు. ఆ జాబులో కనపడిన ఆ దృఢ నిశ్చయమూ, ఆ ఆత్మవిశ్వాసమూ చూసి నాకు ఆశ్చర్యం కలిగింది. పార్వతిపట్ల నాకు ఎప్పుడూ లేని గౌరవభావం కలిగింది. జాబు తిరిగి అతని చేతిలో పెడుతూ నేను "ఇంతకు ఎప్పుడు పోయింది? ఎలా పోయింది?" అని అడిగినాను. నిజానికి "ఎవరితోపోయింది" అనేది నేను అడగదలచుకొన్న ప్రశ్న. ఆ ప్రశ్న అడగలేక అలా మరేదో అడిగినాను. నేను అడగలేకపోయిన ప్రశ్నకు కూడా శేషగిరి జవాబుచెబుతున్నట్లుగా మాట్లాడినాడు. "ఎప్పుడు పోయిందో, యెలా పోయిందో, ఎవరితో లేచిపోయిందో యేమీ తెలియడంలేదు. ఏ కులం తక్కువవాడో అయివుంటాడు. అర్ధరాత్రి తర్వాత వెళ్ళిపోయినట్లుంది. పోదలచుకున్నవాళ్ళకు ఏ వేళప్పుడైనా రైలో, బస్సో ఏదో ఒకటి దొరుకుతుంది గదా!" అన్నాడు అతను. నేను మరో రెండు మూడు నిమిషాలు మౌనంగా కూర్చొని, తర్వాత సెలవు తీసుకొని వచ్చేసినాను. వస్తూ, వస్తూ, శేషగిరి కులం ప్రస్తావన తెచ్చినందుకు ఆశ్చర్యపడుతూ వచ్చినాను. కూతురు లేచిపోవటం తలిదండ్రులకు మోయలేని అవమానమే అయితే, కులస్థునితో లేచిపోతే ఆ అవమాన భారం తక్కువా

తుందా, అనే సందేహం నాకుకలిగింది.

ఇది జరిగి మూడు నెలలకు పైగా అయింది. శేషగిరి ఒక నెల సెలవు పెట్టి. తరువాత యధావిధిగా ఆఫీసుకు వస్తున్నాడు ఆ దుఃఖంనుండి అతను మెల్లగా కోలుకుంటున్నట్లుంది. ఈలోగా పార్వతిని గురించి కొన్ని వార్తలు తెలుస్తూనే వచ్చినాయి. ఆమెను లేవదీసుకుపోయినవాడు బాంకిలో గుమాస్తా అనీ, హైదరాబాదుకు బదిలీ అయి. పోతూ పోతూ పార్వతిని లేవదీసుకుపోయినాడనీ వెల్లడయింది కొంతకాలం తర్జన భర్జనలు జరిగిన తర్వాత అతను హరిజనుడని కూడా ధ్రువపడింది. మనిషి అందంగానే వుంటాడనీ, మొత్తంమీద బుద్ధిమంతుడే అనీకూడా తెలిసింది.

ఈ దినం సాయంత్రం నేను కాంపునుండి తిరిగి వచ్చేటప్పటికి నా భార్య తలవాకిట్లోనే యెదురయి, ముసిముసి నవ్వులతో "విన్నారా?" అన్నది వినడానికి నేను ఆగినాను "పొద్దునపార్వతి వచ్చింది. అంటూ ఆమె నా ముఖంలోకి చూసింది. "ఎవరూ? శేషగిరి కూతురా?" అన్నాను. "ఆఁ కూతురూ, అల్లుడూ ఇద్దరూ వచ్చినారు. ఎంత ముద్దముచ్చటగా వున్నారనుకున్నారో! చిలకా గోరింకల్లా ఉన్నారు. పార్వతి ఇంకా అందంగాతయారయింది. సంతోషంతో ముఖం వెలిగిపోతున్నదంటారే అలాంటి వెలుగు నాకీనాడు పార్వతి ముఖంలో కనిపించింద" అన్నది నా భార్య. "నీ వెప్పుడు చూసినావు?" అని అడిగినాను నేను. "ఎప్పుడేమిటి! మధ్యాహ్నం భోంచేసి, తీరికగా వెళ్ళి, రెండు గంటలకు పైగా వాళ్ళింట్లోనే వున్నాను. పార్వతి యింటందరికీ బట్టలూ,బహుమతులూ తెచ్చింది. తమ్ముళ్ళకూ, చెల్లెలికీ రెడీమేడ్ బట్టలు తెచ్చింది. తల్లికి మంచి చీర తెచ్చింది. ఇంకా ఏమేమి తెచ్చిందో! ఇల్లంతా కళకళలాడిపోతున్నది. అల్లుడినీ, కూతురినీ చూసుకొని శేషగిరీ, నాగరత్నమ్మా యెంతగా పొంగిపోతున్నారో! కండ్లారా చూస్తేగానీ మీరు నమ్మలేరు." అంటూ నా భార్య ఉపన్యాసం ముగించింది. చిరునవ్వు నవ్వుతూ నేను వెళ్ళి కుర్చీలో కూర్చున్నాను. "అసలు విషయం అది కాదండీ, ఇప్పుడు మనం వాళ్ళింటికి భోజనానికి వెళ్ళాలి" అన్నది ఆమె. "ఎందుకంట?" అన్నాను. "ఎందుకేమిటి! ఇంట్లో శుభకార్యం జరిగితే చుట్టపక్కాలను భోజనానికి పిలవరూ! అంతే ఇది. కూతురూ, అల్లుడూ వస్తే ఇంట్లో పండగ చేసుకోరూ! అంతేఇది. మిమ్మల్ని పిలవడానికని శేషగిరి ఇప్పటికే నాలుగుసార్లు మన ఇంటిచుట్టూ తిరిగినాడు. తన సంతోషాన్ని మీతో పంచుకోవాలని ఆయన యెంతగా ఉబలాటపడుతున్నాడో మీరు ఊహించలేరు" అంటూ నా భార్య చిన్న ఉపన్యాసం ముగించింది. "నిజంగా అంత ఉబలాటపడుతున్నాడా?" అన్నాను నేను. "అయ్యో! మీరు చూసిందాకా నమ్మలేరు. మధ్యాహ్నం వెళ్ళి అక్కడ రెండు మూడు గంటలసేపు వున్నా నా. అంతసేపూ శేషగిరి అల్లుడిచుట్టూ తిరగడమూ అల్లుడికి అవసరాలు కనుక్కోవ

[illegible]
స్వామివారికి భక్తులు సేవలు చేసినట్లు అనిపించింది నాకు," అంటూ నా భార్య ఒక క్షణం ఆగి, "అయ్యో, నామతి మండా! ఇంతకూ అసలు విషయం మీకు చెప్పనే లేదు. ఇంట్లో పిండి వంటలు చేయిస్తున్నారు. యెన్ననుక న్నారో! అదే పనిగా ఒక వంటమనిషిని పిలిపించి, పది కిలోల చక్కెరతెప్పించి నాలుగైదు రకాల పిండివంటలు చేయిస్తు న్నారు. "ఇన్నెందుకక్కా?" అని అడిగినాను. నాగరత్నమ్మ సంబరంపట్ట లేక ముఖం చాటంత చేసుకొని, "యెన్ను న్నయ్ లేమ్మా! పార్వతికి నెల తప్పింది గదా," అని జవాబు చెప్పింది. అదీ అసలు విషయం, అంటూ నా భార్య ఉపన్యాసం ఆపి, తానే యేదో ఘనకా ర్యం చేసినట్లు విజయగర్వంతో నావైపు చూసింది. నేను లోపలినుండి వస్తున్న నవ్వును అణచుకుంటూ మెల్లగాఅన్నాను. "పార్వతి లేచిపోయిన రోజున శేషగిరికి ఆపద వచ్చిందన్నావే-ఇప్పుడు చెప్పు, అది ఆపదేనా?" నా భార్య ఒక క్షణం తెల్లబోయి, వెంటనే తేరుకొని, కిలకిల నవ్వుతూ, "యెప్పటి మాటలో! యిప్పు డవన్నీ యెందుకండీ!" అన్నది. నేను అంతటితో వదలిపెట్టకుండా, "కూతురు లేచిపోతే ఆపదేనంటావా? నీకూ ఆడ పిల్లలున్నారు, ఆలోచించి చెప్పు" అన్నాను. నా భార్య జవాబుచెప్పకుండా బుంగమూతి పెట్టుకొని ఇంటోకి పోయింది ●


# రు. 80.000/- విలువగల బహుమతులు గెలవండి

*ప్రవేశ రుసుము లేదు*

| | | |
|---|---|---|
| 22 | 27 | 20 |
| 21 | 23 | 25 |
| 26 | 19 | 24 |

(మాదిరి మొత్తం69)

మొదట చేరిన 10 ఎంట్రీలకు టేప్‌రికార్డర్ ఉచితం. బహుమతులు : టెలివిజన్ లేదా టేప్‌రికార్డర్ కన్సొలేషన్ బహుమతులు ; జెనేవా టెలీస్టార్ నేషనల్ మోడల్-84 ట్రాన్సిస్టర్ రు. 350/- లు విలువగలది 175 రూ॥లకే. వ్యాపార అభివృద్ధి పథకంమీద. కాగితంమీద తొమ్మిది గళ్ళను గీసి 18 నుండి 26 వరకూ అంకెలని ఒకేసారి ఉపయోగిస్తూ మొత్తం-66 రావాలి. ఎంట్రీలు 20 రోజుల్లోగా చేరాలి.

NEW GENEVA ELECTRONICS (JV)

Post Box No. 36, Ambala-133001.